జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.


epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



# ఉద్దానం తీరంపై..
# కార్పొరేట్ల కన్ను!



* బీచ్ శాండ్ మినరల్స్ కోసం గుట్టుగా ప్రయత్నాలు
* అటవీ భూమి పేరుతో ఇప్పటికే సరిహద్దులు గుర్తింపు
* పరిశ్రమల ఏర్పాటుతో మత్స్యకారులకు తీవ్ర నష్టం
* అధికారులు, ప్రజా ప్రతినిధులకు తెలిసినా అంతా గప్‌చుప్
* ఉద్దానం మత్స్యకారుల్లో అలజడి

సోంపేట జూన్ 7 (వార్త): ఉద్దానం మత్స్యకారుల్లో అలజడి మొదలయ్యింది. ప్రశాంతమైన సముద్ర తీరంలో బీచ్ శాండ్ మినరల్స్ పరిశ్రమల ఏర్పాటు కోసం కార్పొరేట్ కంపెనీలు కన్నేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రెండు కంపెనీలు బారువా నుంచి ఇచ్ఛాపురం వరకు ఉన్న సముద్ర తీరం ఇసుక దిబ్బల్లో పరిశ్రమలు నెలకొల్పేందుకు దరఖాస్తులు కూడా చేసినట్లు ఇటీవల సమాచార హక్కు చట్టం ద్వారా వెల్లడైంది. ఇటువంటి పరిశ్రమలు ఏర్పాటు అయితే కార్పొరేట్ కంపెనీలకు విపరీతమైన లాభాలు ఆర్జించే అవకాశాలు మెండుగా ఉన్నప్పటికీ దశాబ్దాలుగా తీరాన్ని నమ్ముకుని బతుకులు సాగిస్తున్న మత్స్యకారులకు తీవ్ర నష్టాలు తప్పవని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని మత్స్యకార గ్రామాల్లో వైసీపీ సమ న్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి మత్స్యకారులను అప్రమత్తం చేస్తు న్నారు. ఇదే ఉద్దానం తీరంలో గతంలో ఎన్‌సీసీ కంపెనీ ఆధ్వర్యంలో థర్మల్ విద్యుత్ కర్మాగారం ఏర్పాటుకు యాజ మాన్యం ముందుకు రాగా ఉద్దానం ప్రజలతో పాటు సోం పేట, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, మత్స్యకారులు కలిసి తీవ్రంగా పోరాడి విజయం సాధించిన విషయం తెలి సిందే. అదే పరిస్థితుల్లో మళ్ళీ ఈ ప్రాంతానికి పరిశ్రమల పేరుతో కార్పొరేట్ కంపెనీలు దూసుకు వస్తున్న నేపథ్యంలో మత్స్యకారుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. ఈ వ్యవ హారం ఇప్పటికే అధికార యంత్రాంగానికి ప్రజాప్రతినిధు లకు తెలిసినప్పటికీ ఏ ఒక్కరూ విషయాన్ని బయటకు పొక్కకుండా మౌనం దాల్చడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే అటవీశాఖ, రెవెన్యూ శాఖ సంయుక్తంగా సర్వే నిర్వహించి అటవీ భూముల సరి హద్దులను ఇటీవల గుర్తించడంతో అక్కడి నుంచే ప్రజల్లో ఆందోళన నెలకొంది. అతి కొద్ది రోజుల్లోనే ఈ భూముల్లో పరిశ్రమలు రానున్న సంగతి బయటపడడంతో ఈ ప్రాంతంలో దీనిపై మరింత చర్చ జరుగుతుంది.



## ఏమిటి ఈ పరిశ్రమలు..

సముద్ర తీరంలో గల ఇసుకలో నెలకొల్పనున్న బీచ్ శాండ్ పరిశ్రమ ద్వారా లభించే విలువైన ఖనిజాలతో కార్పొరేట్ కంపెనీలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారాలు సాగించనున్నాయి. సముద్రపు ఇసుకలో లభించే ఇల్మానైట్, జిర్కాన్, మోనజైట్, గార్నెట్, రూటైల్ వంటి ఖనిజాల నుంచి థోరియం, యురేనియం, టైటానియం వంటి విలువైన ఖనిజాలు సేకరించనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఎంతో విలువైన ఇటువంటి ఖనిజాలకు మంచి డిమాండ్ ప్రస్తుతం నెలకొని ఉంది. వీటి ద్వారా విపరీతమైన లాభాల ఆర్జనకు కార్పొరేట్ కంపెనీలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఆయా ప్రాంతాలను తమ గుప్పెట్లోకి తీసుకుంటున్నాయి. ఈ కోవలోనే జిల్లాలోని ఉద్దానం ప్రాంతం సముద్ర తీరాన్ని కూడా ఆక్రమించుకునే ప్రయత్నాల్లో పలు కంపెనీలు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే బారువా నుంచి ఇచ్చాపురం వరకు సముద్రతీర ఇసుక నేలల్లో ఖనిజాల సేకరణకు ఆంధ్రప్రదేశ్ మైనింగ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అలాగే ఇండియన్ రేర్ ఎర్త్ లిమిటెడ్ ప్రభుత్వానికి దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారిక సమాచారం ద్వారా తెలుస్తోంది.

## పరిశ్రమలు వస్తే మనకేంటి నష్టం..

సముద్ర తీరంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే అందరికన్నా ముఖ్యంగా మత్స్యకారులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. ఇప్పటికే వీటిపై అధ్యయనం చేసిన పర్యావరణవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీచ్ శాండ్ ప్రాసెసింగ్ ద్వారా వచ్చే విపరీతమైన శబ్దాలు, ప్రకంపనలు ప్రజలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంటాయి. పరిశ్రమలు విడిచే ఇంధనాలు, రసాయనాలు మూలంగా సముద్రంలో మత్స్య సంపద భారీగా దెబ్బతింటుంది. జీవ మానవ మనుగడ ప్రమాదంలో పడుతుంది. ఇసుక దిబ్బలు కోతకు గురవుతాయి. సమీప నివాస ప్రాంతాల్లోకి ఉప్పునీరు చేరుకుంటుంది తద్వారా తాగునీటి సమస్య ఏర్పడుతుంది. నిర్మాణాలకు నష్టం వాటిల్లుతుంది. చేపల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది. ఇసుక తవ్వకాలతో మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు బాగా సన్నగిల్లుతాయి. మోనజైట్ ఖనిజం నుంచి వెలువడే థోరియంతో చర్మ కాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి అనర్థాలు ఉత్పన్నమవుతాయని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ప్రజలకు అనర్థాలు, నష్టాలు, విపరీతంగా ఉన్నప్పటికీ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ప్రభుత్వాలు మాత్రం పూర్తి మద్దతుగా నిలుస్తున్నాయంటూ పలు విమర్శలు వినిపిస్తున్నాయి.



## ప్రజా ప్రతినిధుల మౌనం..

గుట్టుచప్పుడు కాకుండా చాప కింద నీరులా ప్రమాదకరమైన పరిశ్రమలు ఉద్దానం తీరంలో నెలకొంటున్న పరిస్థితుల పట్ల ప్రజా ప్రతినిధులు మౌనం దాల్చడం చాలా బాధాకరమంటూ పలువురు పేర్కొంటున్నారు. జిల్లాకు చెందిన రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ ప్రయత్నాలను ఇప్పటినుంచే అడ్డుకోకపోతే రాబోయే తరాలకు ఈ ప్రాంతంలో సముద్ర తీరం ఆనవాళ్లు కూడా లేకుండా పోతాయని పలువురు ఆవేదన చెందుతున్నారు.



# కొత్తూరులో..
# బెల్ట్ సామ్రాజ్యం!

* నిబంధనలు బేఖాతరు
* గుడి, బడి పక్కనే మద్యం విక్రయాలు
* ఎంఆర్‌పీ కంటే అదనపు వసూళ్లు
* చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ అధికారులు
* ఓ నేతకు నెలవారీ వాటాలు

కొత్తూరు, జూన్ 7 (వార్త): కొత్తూరు మండలంలో మద్యం వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. నిబంధనలను తుంగలో తొక్కి వైన్ షాపుల నుంచి బెల్ట్ షాపులకు విచ్చలవిడిగా మద్యం రవాణా అవుతున్నా, అడ్డుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు మౌనం వహించడం వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యాసంస్థలు, దైవప్రార్థనా మందిరాలకు దూరంగా మద్యం విక్రయాలు జరగాలి. కానీ, కొత్తూరు మండలంలో మాత్రం ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. పవిత్రమైన గుడులు, భావితరాలను తీర్చిదిద్దే బడుల పక్కనే యథేచ్ఛగా బెల్ట్ షాపులు వెలిశాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఈ షాపుల వద్ద మద్యం బాబుల హంగామా మితిమీరిపోవడంతో.. విద్యార్థులు, మహిళలు, భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


## ఎంఆర్‌పీ కంటే అదనంగా వసూళ్లు..

మండలంలోని వైన్ షాపుల్లో అక్రమ దోపిడీ బహిరంగంగానే సాగుతోంది. ఏ బ్రాండ్ మద్యం కొనుగోలు చేసినా.. ప్రభుత్వ నిర్ణయించిన ఎంఆర్‌పీ కంటే భారీగా అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. రేటు ఎందుకు ఎక్కువ తీసుకుంటున్నారని ప్రశ్నిస్తే.. నిర్వాహకులు దురుసుగా సమాధానం ఇస్తున్నారని మందుబాబులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ అధికారులు..

వైన్ షాపుల నుంచి గ్రామాల్లోని బెల్ట్ షాపులకు బాక్సుల కొద్దీ మద్యం విచ్చలవిడిగా రవాణా అవుతోంది. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ రికార్డుల్లో మాత్రం 'బెల్టు కేసులు' నమోదు కాకపోవడం గమనార్హం. అసలు మండలంలో ఎక్సైజ్ నిఘా ఉందా? లేక అక్రమార్కులతో అధికారులు చేతులు కలిపారా? అని ప్రజలు అనుమానిస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, కొత్తూరు మండలంలో బెల్ట్ షాపులను పూర్తిగా రద్దు చేయాలని, ఎంఆర్‌పీ కంటే అదనపు ధరలకు విక్రయిస్తున్న వైన్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# 'వైసీపీ మాయమాటలు ప్రజలు నమ్మరు'



**జి.సిగడాం, జూన్ 7(వార్త):** వైకాపా నేతల మాయమాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని టిడిపి సీనియర్ నాయకులు కుమరాపు రవి కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి వైకాపా నేతలు ఓర్వలేకపోతున్నారన్నారు. విష ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని కుమరాపు ఆక్షేపించారు. వైకాపా హయాంలో డిఎస్‌సి ప్రకటన చేస్తామని చెప్పి ఐదేళ్లు కాలం వెల్లదీశారని, కూటమిప్రభుత్వం వచ్చి డిఎసిసిని అములు చేస్తే దానిపై కూడా విష ప్రచారం చేయడం శోచనీయమన్నారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పరిపుష్టితకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో 90 శాతం హామీలు నెరవేర్చిందన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కూటమి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు లతోనే సాధ్యమన్నారు. ఈ సమావేశం కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## కొండగొర్రెపై కుక్కల దాడి

* కాపాడిన యువకులు
* అటవీ అధికారులకు సమాచారం



**మెళియాపుట్టి జూన్ 7 (వార్త):** మెళియాపుట్టి మండలంలో గల పరశురాంపురం పంచాయతీ పరిధిలో ఉన్న హీరాపురం గ్రామ సమీప అటవీ ప్రాంతము నుండి ఒక కొండ గొర్రె ఆదివారం ఉదయం గ్రామం వద్ద తారసపడింది, అయితే కొండ గొర్రెను గమనించిన ఊరకుక్కలు దానిపై దాడి చేసే క్రమంలో గ్రామానికి చెందిన యువకులు కొమ్ము గోపాలు, లక్ష్మీపురం వెంకటరావు, నాగరాజు తదితర పలువురు గమనించి కుక్కల దాడి నుండి కొండ గొర్రెను కాపాడి పాతపట్నం అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా అటవీశాఖ సిబ్బంది వారు జీపు తీసుకుని వచ్చిన తర్వాత వారికి కొండ గొర్రెను అప్పగించారు. వారు ఆ కొండ గొర్రెను వారు పాతపట్నం సమీప అటవీ ప్రాంతంలో తీసుకెళ్లి విడిచిపెట్టారు. కొండ గొర్రెను అటవీశాఖ సిబ్బంది ప్రవీణ్ కి అప్పగించడంలో స్థానిక తాజా మాజీ సర్పంచ్ తెంబూరు ప్రసాద్ తోపాటు కొమ్ము గోపాలు, లక్ష్మీపురం వెంకటరావు, నాగరాజు, యువకులు తదితరులు ఉన్నారు.

## 13 అడుగుల భారీ కొండచిలువ ప్రత్యక్షం



**పలాస, జూన్ 7 (వార్త):** మహేంద్రగిరి కొండల ప్రాంతం నుంచి దారి తప్పి వచ్చినట్లు భావిస్తున్న ఓ భారీ కొండచిలువ పలాస మండలంలోని దేశబట్టి కాలువ వద్ద ఆదివారం ప్రత్యక్షమై స్థానికులను భయాందోళనకు గురిచేసింది. కాలువ సమీపంలో వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు, గ్రామస్తులు ఒక్కసారిగా ఆ భారీ కొండచిలువను చూసి బెంబేలెత్తిపోయారు. ఇంత పెద్ద కొండచిలువను తమ జీవితంలో ఎప్పుడూ చూడలేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పలాస అటవీశాఖ రేంజర్ మురళీకృష్ణ నాయక్ వెంటనే స్పందించి సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. కొండచిలువకు ఎలాంటి హాని చేయవద్దని స్థానికులకు సూచించారు. అనంతరం స్నేక్ క్యాచర్ ఓంకార్‌ను పిలిపించి అత్యంత జాగ్రత్తగా ఆ భారీ కొండచిలువను సురక్షితంగా స్పందించారు. పరిశీలించగా దాని పొడవు సుమారు 13 అడుగులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పట్టుకున్న అనంతరం కొండచిలువను పలాస మండలం లొద్దభద్ర సమీపంలోని అటవీ ప్రాంత కొండల్లో సురక్షితంగా విడిచిపెట్టారు. ప్రస్తుతం నెలకొన్న తీవ్ర ఎండల కారణంగా మహేంద్రగిరి కొండల ప్రాంతం నుంచి నీటి కోసం లేదా ఆహారం కోసం దారి తప్పి ఈ ప్రాంతానికి చేరి ఉండవచ్చని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. అటవీశాఖ అధికారులు సకాలంలో స్పందించి కొండచిలువను సురక్షితంగా తరలించడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.


## ప్రతీ విద్యార్థి క్రీడాకారుడుగా ఎదగాలి



**పలాస, జూన్ 7 (వార్త):** ప్రతి విద్యార్థి క్రీడాకారుడుగా తయారు కావాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సాంబమూర్తి సూచించారు. స్కేటింగ్ సమ్మర్ క్యాంప్ ముగింపులో బాగంగా ఆదివారం శ్రీకాకుళం నగరంలో నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజుల్లో పిల్లల నుండి పెద్ద వారి వరకు సెల్ ఫోన్లుకి అలవాటు పడి వారి లక్ష్యంనీ మరిచి పక్క దారి పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్తితిలో అందరు క్రీడలపై దృష్టి సారిస్తే మన జిల్లా నుండి రాష్ట్రానికి, ఇండియాకి మంచి క్రీడా కారులను తయారు చేయగలమని తెలిపారు. అనంతరం స్థానిక వైఎస్ఆర్ మున్సిపాలిటీ కళ్యాణ మండపంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాష్టంగా ప్రరంబించిన సమ్మర్ క్యాంప్ లో పాల్గున్న క్రీడా కారులకు ప్రశంస పాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రావతి, తల్లి దండ్రులు, జిల్లా స్కేటింగ్ కోచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు వైసీపీ నేతల పరామర్శ

**కంచిలి, జూన్ 7 (వార్త):** బూరగాం గ్రామానికి చెందిన సిద్దు అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి శ్రీకాకుళం జేమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అలాగే జాడుపూడి గ్రామానికి చెందిన పిలక సావిత్రి అదే ఆసుపత్రిలో బ్రెయిన్ స్ట్రోక్ సమస్యతో చికిత్స పొందుతుంది. ఈ నేపథ్యంలో ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి, పలువురు వైసీపీ నేతలు కలిసి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కొనపల సురేష్, పలికల జయరాం, గణప సింహాచలం, శ్రీకాంత్ గౌడ్ ఉన్నారు.



# 'పలాస జీడిపప్పు' గొంతుపై 1శాతం సెస్ కత్తి!

* డబుల్ ట్యాక్స్‌తో 25 వేల కుటుంబాలు రోడ్డున పడతాయి
* సెస్ రద్దు చేయకపోతే పరిశ్రమే ఉండదు
* జీడిపప్పు లేకపోతే పలాస చిరునామా గల్లంతే
* ప్రముఖ న్యాయవాది, పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్



**పలాస, జూన్7 (వార్త):** పలాస జీడిపప్పు గడ్డుకాలం ప్రారంభమైంది. ప్రపంచానికి రుచి చూపించిన పలాస జీడిపప్పు గొంతుపై ప్రభుత్వం 1 శాతం ఏఎంసి సెస్ కత్తి పెట్టింది. జూలై 1 నుంచి అమలు చేస్తే 25 వేల కుటుంబాలు రోడ్డున పడతాయని ప్రముఖ సామాజిక వేత్త, న్యాయవాది, పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్ (బాబా) ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పలాసలోని తన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఆయన ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. "ఒకే వస్తువుపై రెండుసార్లు పన్ను వేయడం అంటే పరిశ్రమను సమాధి చేయడమే. ఇది డబుల్ ట్యాక్సేషన్ కాదు.. డైరెక్ట్‌గా ఉరిశిక్షనని, పలాస జీడిపప్పు పరిశ్రమ వెన్నెముక విరగ్గొట్టే కుట్ర ఇది" అంటూ ఆయన పంచ్ విసిరారు. ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి వచ్చే ముడి జీడిపిక్కలపై ఇప్పటికే కస్టమ్స్ డ్యూటీ, జీఎస్టీ, రవాణా చార్జీలు అన్నీ కట్టి తెస్తున్నామని, అదే పిక్కను ప్రాసెస్ చేసి జీడిపప్పుగా అమ్మేటప్పుడు మళ్లీ 1శాతం ఏఎంసి సెస్ వేయడం ఎక్కడి న్యాయమని నిలదీశారు. "ముడి పిక్కకు ఒకసారి, పప్పుకు ఒకసారి.. ఇదేం పాలన సార్?" అని ప్రశ్నించారు. '20 కోట్ల టర్నోవర్ ఉన్న యూనిట్‌పై ఏడాదికి 20 లక్షల అదనపు భారం పడుతుంది. 5 కోట్ల టర్నోవర్ ఉన్న చిన్న యూనిట్‌పై 5 లక్షలు పడుతోంది. ఇప్పటికే తక్కువ లాభాలతో, బ్యాంకు వడ్డీలు కట్టుకుంటూ నెట్టుకొస్తున్న చిన్న పరిశ్రమలు ఈ భారం తట్టుకోలేక మూతపడతాయని, పరిశ్రమ మూతపడితే ఆకలి కేకలే మిగులుతాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఒడిశా, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లో జీడిపప్పుపై ఏఎంసి సెస్ లేదని, కేవలం ఆంధ్రప్రదేశ్‌లోని పలాసలోనే ఈ సెస్ ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. "వాళ్లకు లేని సెస్ మనకెందుకు? ఏపీ పారిశ్రామికవేత్తలు ఏం పాపం చేశారు? పక్క రాష్ట్రం ఒడిశాలో సెస్ లేదు.. మనకు మాత్రం కత్తి. ఇది కావాలని పలాస పరిశ్రమను ఒడిశాకు తరిమేసే కుట్ర కాదా? మన బిడ్డలకు అన్నం పెట్టే పరిశ్రమను పక్కోడికి అప్పగించేద్దామా?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ, పలాస కార్యదర్శి జారీ చేసిన అధికారిక ప్రకటన ప్రకారం మందస, వజ్రపుకొత్తూరు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని వర్తకులందరూ ఆన్‌లైన్ ట్రేడర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, కొత్త పేర్మిట్ విధానంలో ఆన్‌లైన్‌లోనే 1శాతం సెస్ వసూలు చేస్తారని ఆయన వివరించారు. "ఆన్‌లైన్ పేరుతో వ్యాపారిని ఉరి తీస్తున్నారు. పేర్మిట్ ఇవ్వకపోతే సరుకు బయటకు పోదు.. సెస్ కట్టకపోతే పేర్మిట్ రాదు. ఇది వ్యాపారం చేయడం కాదు.. బతుకు బజారులో పెట్టడం" అని మండిపడ్డారు. ఈ సెస్ వల్ల ఎగుమతి ధరలు కిలోకు 15 నుంచి 20 వరకు పెరుగుతాయని, దీంతో వియత్నాం, ఆఫ్రికా దేశాల జీడిపప్పుతో పోటీ పడలేమని చెప్పారు. "ఇప్పటికే వియత్నాం పప్పు మన మార్కెట్‌ను ఆక్రమిస్తోందని, ఇప్పుడు సెస్ వేస్తే పలాస పరిశ్రమ దెబ్బతింటుందని అన్నారు. చివరకు వేలాది మంది కార్మికులు, ముఖ్యంగా 70శాతం ఉన్న మహిళా కార్మికులు ఉపాధి కోల్పోతారు. వాళ్ల పొయ్యిలో పిల్లి లేవడం ఖాయం" అని హెచ్చరించారు. "పలాస జీడిపప్పు పరిశ్రమను కాపాడటం అంటే వేలాది కుటుంబాల భవిష్యత్తును కాపాడటమే. ప్రభుత్వం వెంటనే 1శాతం సెస్‌ను రద్దు చేయాలి. పలాస పరిశ్రమను 'ప్రత్యేక పరిశ్రమ'గా గుర్తించి మినహాయింపులు ఇవ్వాలి. పరిశ్రమ యజమానులు, కార్మిక సంఘాలతో సమావేశం పెట్టి నిర్ణయం తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. పలాసలో 300కు పైగా చిన్న, మధ్య తరహా జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి బతుకుతున్న వారు లక్ష మందికి పైగానే ఉంటారు. ముడిసరుకు దిగుమతి, ప్రాసెసింగ్, ప్యాకింగ్, రవాణా, ఎగుమతి ఇలా ప్రతి దశలోనూ వేలాది మందికి ఉపాధి కలుగుతోంది. ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇచ్చి మరో 200 కొత్త యూనిట్లకు ఇండస్ట్రియల్ ఏరియాలో స్థలం కేటాయిస్తే.. ప్రస్తుతం ఉన్న 25 వేల ఉద్యోగాలకు అదనంగా మరో 20 వేల మందికి ఉపాధి లభిస్తుందని శ్రీధర్ (బాబా) తెలిపారు. "పలాస పరిశ్రమకు జీ ఐ ట్యాగ్ ఉందని, అంతర్జాతీయ మార్కెట్‌లో పలాస పప్పుకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇలాంటి పరిశ్రమను పన్నులతో వేధిస్తే అభివృద్ధి ఎలా సాధ్యం? యువ పారిశ్రామికవేత్తలకు చేయూత ఇస్తే పలాస మరో తిరుపూర్ అవుతుంది. లేదంటే పలాస పాడుబడిన ఊరు అవుతుంది" అని వ్యాఖ్యానించారు. "పలాస అంటే జీడిపప్పు.. జీడిపప్పు అంటే పలాస. ఈ పరిశ్రమ లేకపోతే పలాస చిరునామా గల్లంతే. సెస్ రద్దు చేయకపోతే పరిశ్రమే ఉండదు.. పరిశ్రమ లేకపోతే పలాసే ఉండదు" అని ఆయన అన్నారు. జూలై 1లోపు ప్రభుత్వం సెస్ రద్దు చేయకపోతే పరిశ్రమ యజమానులు, కార్మికులు, వ్యాపారులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని పలాస కాజూ ప్రాసెసర్స్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని వెంటనే పునఃసమీక్షించి ఇతర రాష్ట్రాల మాదిరిగా ఏపీలో కూడా సెస్ రద్దు చేయాలని పలాస ప్రాంత ప్రజల తరఫున ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



# వైసీపీ మూర్ఖపు పాలనలో రోడ్లు ధ్వంసం

* గడచిన ఐదేళ్లలో తుగ్గక్ పాలన
* టిడిపి మండల అధ్యక్షుడు సూరాడ మోహన్ ధ్వజం



**పలాస, జూన్ 7 (వార్త):** వైకాపా మూర్ఖపు పాలనలో రోడ్లు ధ్వంసం చేశారని, ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడారని వజ్రపు కొత్తూరు టిడిపి మండల అధ్యక్షుడు సూరాడ మోహన్ ధ్వజమెత్తారు. శనివారం పలాస పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తుగ్లక్ పాలన వల్ల రాష్ట్రంలో వేలాది మంది రోడ్డు ప్రమాదాల్లో వీధిన పడి చనిపోయే పరిస్థితి వచ్చిందని, ఇది ముమ్మాటికీ వైకాపా మూర్ఖపు పాలన లక్షణమేనని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని మొత్తం తెగనమ్మి, దోచుకున్నారన్నారు. ఈరోజు తలదించుకోకుండా నిజాయితీగా పాలన సాగిస్తున్న తెలుగుదేశం-కూటమి నాయకులపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో కనీసం ఒక్కటంటే ఒక్క కార్యక్రమమైనా నిజాయితీగా చేశామని గుండెల మీద చేయి వేసుకుని చెప్పగలరా? అని సవాల్ విసిరారు. ఐదేళ్లూ నరకం చూపించారని, "రాష్ట్రవ్యాప్తంగా ఒక్క పాడైపోయిన రోడ్డునైనా జగన్ మోహన్ రెడ్డి బాగు చేశారా? అధ్వాన్నపు రోడ్ల వల్ల లక్షలాది మంది ప్రజలు, రోజువారీ కూలీలు, చిన్న వాహనాలు నడుపుకుంటూ జీవించే కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. అక్కుపల్లి నుంచి కాశీబుగ్గ వరకు ఉన్న 16 కిలోమీటర్ల ఆర్ అండ్ బి రోడ్డును ఐదేళ్లపాటు కంకర వేసి అలాగే వదిలేశారని, దీనివల్ల ఎంతమంది అనారోగ్యాల పాలయ్యారో, ఎంతమంది నరకం అనుభవించారో వైకాపా నాయకులకు తెలుసా? ఇలాంటి వాళ్లు ఈరోజు రోడ్ల నాణ్యత గురించి మాట్లాడటం దారుణం" అని సూరాడ మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మట్టి నింపి వదిలేశారని, గ్రామాల్లోని ప్రతి జంక్షన్‌లో సీసీ రోడ్లు వేయాల్సింది పోయి, కేవలం గ్రావెల్ మట్టి నింపేసి వదిలేశారని, అటు సీసీ రోడ్డు వేయక, ఇటు బీటీ రోడ్డు వేయక ప్రజలకు నరకం చూపించారని విమర్శించారు. వైకాపా నాయకులు చెప్పే అబద్ధాలను వారి పార్టీ అభిమానులు నమ్మితే నమ్మొచ్చు గానీ, సాధారణ ప్రజలు, కూటమి కార్యకర్తలు మాత్రం వారి మాటలను అసహ్యించుకుంటున్నారని స్పష్టం చేశారు. వైకాపా నాయకులకు కేవలం మైనింగ్ లెక్కలు, బిల్డింగుల కాంట్రాక్టులపై ఉన్న శ్రద్ధ ప్రజల ఆరోగ్యంపై లేదని సూరాడ మోహన్ ఆరోపించారు. రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సచివాలయ భవనాలు, ఆర్బీకే బిల్డింగులను ముందే ఒక పెద్ద కాంట్రాక్టర్‌తో మాట్లాడుకుని, భారీ స్థాయిలో అవినీతికి తెరలేపారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా వైకాపా నాయకులు వాస్తవాలు తెలుసుకొని, పరిసరాల పరిస్థితులను గమనించి మాట్లాడాలని, బురదజల్లే రాజకీయాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. ఈ సమావేశంలో వజ్రపు కొత్తూరు మండల పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పూలే పెరియార్ జైభీమ్ చైతన్యవేదిక నూతన కార్యవర్గం

* అధ్యక్షునిగా సంక కాళిదాసు



**మందస, జూన్ 7(వార్త):** మందస మండలంలోని పొత్తంగి-సిరిపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటైన "పూలే పెరియార్ జైభీమ్ చైతన్యవేదిక" ప్రథమ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, పెరియార్, బాబాసాహెబ్ డా.బి.ఆర్. అంబేద్కర్‌ల సామాజిక విప్లవ స్ఫూర్తితో ఈ కమిటీని రూపకల్పన చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అధ్యక్షులుగా సంక కాళిదాసుపూలే పెరియార్ జైభీమ్ చైతన్యవేదిక అధ్యక్షునిగా సంక కాళిదాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా నూతన కార్యవర్గం వివరాలిలా ఉన్నాయి. గౌరవ సలహాదారులుగా ఇప్పిలి భీమరావు, సంక కేశవరావు, ఉపాధ్యక్షులుగా నగిరి తారకేశ్వరరావు, నిర్వహణ కార్యదర్శులుగా సంక నారాయణరావు, కదంబాల ప్రవీణ్ కుమార్, సీర. నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. కోశాధికారులుగా ఇప్పిలి హేమసుందర్, నగిరి బాలకృష్ణ, ఇప్పిలి తనూజ, సామాజిక మాధ్యమబాధ్యులుగా సంక హరీష్, తెప్ప నీలకంఠం, క్రియాశీల సభ్యులుగా నగిరి గణపతి, సంక వెంకటరావు, తెప్ప లోహిదాసు, పాటి జగదీష్,నగిరి పద్మనాభం, నగిరి సురేష్ బాబు, సంక తారకేశ్వరరావు, సంక భాస్కరరావు, నగిరి కిరణ్ కుమార్, సంక అప్పారావు, గమింగి అజయ్, సంక మహేష్ ఎన్నికయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శులుగా నగిరి చక్రపాణి, సంక ప్రవీణ్, గొలియా బాలకృష్ణ, దిస్క భాస్కరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు సంయుక్తంగా మాట్లాడుతూ, గ్రామంలో యువతను, విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు, వారిలో సామాజిక బాధ్యతను పెంచేందుకు రాబోయే రోజుల్లో ఈ కార్యవర్గం ఆధ్వర్యంలో అనేక సేవా, విద్యాసంబంధిత కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. నూతన కమిటీ ఎన్నిక పట్ల గ్రామ ప్రజలు, మేధావులు మరియు విద్యావంతులు హర్షం వ్యక్తం చేస్తూ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



## ఎఫ్ఎల్ఎన్ శిక్షణ పరిశీలన



**నరసన్నపేట, జూన్ 7(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) శిక్షణ కార్యక్రమాన్ని స్టేట్ ఎస్సీఈఆర్టీ కో-ఆర్డినేటర్ సృజన్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. విద్యార్థులకు ప్రాథమిక దశలోనే చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటి నైపుణ్యాలు సమర్థంగా రావాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. బోధనలో సాంప్రదాయ పద్ధతులతో పాటు ప్లే బేస్డ్ యాక్టివ్ మెథడ్స్‌ను వినియోగించి విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధన పద్ధతులను అమలు చేయడం ద్వారా అభ్యాస ఫలితాలు మెరుగుపడతాయని తెలిపారు. చిన్నారుల్లో నేర్చుకునే సామర్థ్యాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు సృజనాత్మకతతో బోధించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న తీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొని బోధనా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## విశాఖ ఆర్డీవో దిలీప్ చక్రవర్తికి అభినందనలు

**నరసన్నపేట, జూన్ 7 (వార్త):**విశాఖపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన దిలీప్ చక్రవర్తిని నరసన్నపేట తహశీల్దార్ సత్యనారాయణ ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ విశాఖపట్నం ఆర్డీవోగా నియమితులైన దిలీప్ చక్రవర్తి నరసన్నపేట మండలం జమ్ము గ్రామానికి చెందినవారు. ఈ నేపథ్యంలో ఆయన స్వగ్రామంలో ఉన్న నివాసంలో తహశీల్దార్ సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చక్రవర్తి సేవలను కొనియాడుతూ, కొత్త బాధ్యతల్లో కూడా ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రాంతానికి చెందిన వ్యక్తి ఉన్నత పదవికి ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ భేటీలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్వోలు రెవెన్యూ సిబ్బంది పాల్గొని దిలీప్ చక్రవర్తికి అభినందనలు తెలిపారు.

# ఓటు హక్కు అక్రమార్కుల పాలుకాకూడదు

*** వైసీపీ 'మద్యం' డ్రామాలు.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది * ఐదేళ్ల 'క్యాష్' చరిత్ర మర్చిపోయారా * ఎమ్మెల్యే గౌతు శిరీష అభివృద్ధిని చూసి ఓర్వలేకే కుట్రలు * టీడీపీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన * మందసలో ఎస్ఐఆర్ సర్వేపై అవగాహన సదస్సు**



**మందస, జూన్ 7(వార్త):** మందస పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆదివారం పార్టీ శ్రేణుల కోలాహలంతో సందడిగా మారింది. పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష స్పష్టమైన ఆదేశాల మేరకు, రాబోయే రోజుల్లో అత్యంత కీలకమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే(ఎస్ఐఆర్) ప్రక్రియపై మండల స్థాయి విస్తృత అవగాహన సదస్సు అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది. ఓటు హక్కు అక్రమార్కుల పాలు కాకూడదు: బావన దుర్యోధనఈ కీలక సమావేశానికి మందస మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీ బావన దుర్యోధన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, ఓటర్ల జాబితాలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో ప్రతి బూత్ పరిధిని క్షుణ్ణంగా పరిశీలించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉంది. ఎమ్మెల్యే గౌతు శిరీష నాయకత్వంలో మందస మండలంలో సర్ సర్వేను పకడ్బందీగా ముందుకు తీసుకెళ్తామన్నారు. సమన్వయంతో ముందుకు సాగాలిమండల ప్రధాన కార్యదర్శి సాలీనా మాధవ రావు, క్లస్టర్ ఇంచార్జీ దాసరి తాతారావు పాల్గొని, గ్రామాల్లో క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయి నాయకులు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. అర్హులైన యువతీ యువకులకు కొత్త ఓట్ల నమోదు, జాబితాలో తప్పుల సవరణలపై ప్రజల్లో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సర్వేలో అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో చేపట్టవలసిన చర్యలపై నాయకులకు మరియు కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సుకు నియోజకవర్గ, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, క్లస్టర్, యూనిట్ ఇంచార్జీలు, కో-ఇంచార్జీలు, క్రియాశీలక కార్యకర్తలు సంఖ్యలో తరలివచ్చి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పలాసలో వైసీపీ 'మద్యం' డ్రామాలు.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందిపలాస నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ(వైసీపీ) నాయకులు మద్యంపై చేస్తున్న పోరాటాలు చూస్తుంటే.. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చేందుకు చేసిన మరో మహా ఉద్యమంలా కలరింగ్ ఇస్తున్నారని టీడీపీ నాయకులు తీవ్రంగా ఎద్దేవా చేశారు. గత ఐదేళ్ల తమ నల్లని చరిత్రను మర్చిపోయి, నేడు వీధులకెక్కి విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని మండిపడ్డారు. మీ ఐదేళ్ల 'క్యాష్' చరిత్ర మర్చిపోయారా..?ఈ సందర్భంగా టీడీపీ నేత బావన దుర్యోధన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం దోపిడీని ప్రజలు ఇంకా మర్చిపోలేదని గుర్తు చేశారు. కల్తీ స్పిరిట్‌తో నాసిరకం మద్యం తయారు చేసి, ప్రభుత్వ దుకాణాల ద్వారానే అమ్మిస్తూ ప్రజల ప్రాణాలతో ఆడుకుంది మీ వైసీపీ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. ఆన్-లైన్ పేమెంట్లు లేకుండా కేవలం నగదు (క్యాష్) రూపంలోనే లావాదేవీలు జరుపుతూ భారీ మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారని, ఆ సొమ్మంతా అప్పటి ముఖ్యమంత్రి, స్థానిక వైసీపీ నేతల జేబుల్లోకే వెళ్ళిందని ధ్వజమెత్తారు. చివరికి సమాజంలో ఎంతో గౌరవప్రదమైన స్థానంలో ఉండే ప్రభుత్వ ఉపాధ్యాయులను మద్యం షాపుల ముందు కాపలా నిలబెట్టి, సభ్య సమాజం తలదించుకొనేలా చేసిన ఘనత ముమ్మాటికీ వైసీపీదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గౌతు శిరీష అభివృద్ధిని చూసి ఓర్వలేకే కుట్రలుపలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష నియోజకవర్గంలో శరవేగంగా చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకే వైసీపీ నేతలు కుట్ర పూరిత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. మద్యం మీద అక్రమ వసూళ్లు జరుగుతున్నాయంటూ వారు చేస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయ ఉనికి కోసమేనని కొట్టిపారేశారు. వైసీపీ నేతలు ఎన్ని రకాలుగా అబద్ధపు ప్రచారాలు చేసినా పలాస ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. గత ఐదేళ్ల మీ అవినీతి పాలనను, ప్రస్తుత ఎమ్మెల్యే గౌతు శిరీష గారి అభివృద్ధి మంత్రాన్ని ప్రజలు గమనిస్తున్నారు. మీ డ్రామాలకు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# షట్టర్ల లేక వృథాగా సాగునీరు

*** మరమ్మతులకు గురైన వంశధార కాలువలు * రైతులకు అందని సాగునీరు * ఇబ్బందులు పడుతున్న ఆయకట్టుదారులు**



**నరసన్నపేట, జూన్ 7 (వార్త):**నరసన్నపేట వంశధార సబ్ డివిజన్ పరిధిలోని వంశధార కాలువల్లో దశాబ్ద కాలంగా షట్టర్లు ఏర్పాటు చేయకపోవడంతో సాగునీటి నిర్వహణ తీవ్రంగా దెబ్బతింటోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గొట్టా బ్యారేజ్ నుంచి విడుదల చేస్తున్న సాగునీరు కాలువల్లో షట్టర్లు లేకపోవడంతో నియంత్రణ లేకుండా దిగువ ప్రాంతాలకు వృథాగా పారిపోతున్న పరిస్థితి నెలకొంది. గతంలో కాలువల్లో ఏర్పాటు చేసిన షట్టర్ల సహాయంతో నీటిని అవసరానికి అనుగుణంగా నిల్వచేసి పంట పొలాలకు సాగునీరు అందించేవారని రైతులు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం షట్టర్లు లేకపోవడంతో నీటి ప్రవాహాన్ని అదుపు చేయడం సాధ్యం కాక రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు. ప్రత్యేకంగా ఎగువ ప్రాంతాలకు చెందిన రైతులకు సరిపడా నీరు అందక పంటల సాగుపై ప్రభావం పడుతోందని పేర్కొంటున్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు ప్రతి ఏడాది ఇదే సమస్యను ఎదుర్కొంటున్నప్పటికీ సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించడం లేదని విమర్శిస్తున్నారు. కాలువల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా సాగునీటి వనరులు సక్రమంగా వినియోగించుకోలేకపోతున్నామని రైతులు అంటున్నారు. వెంటనే కాలువల్లో అవసరమైన చోట్ల కొత్త షట్టర్లు ఏర్పాటు చేసి నీటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వర్షాకాలం, ఖరీఫ్ సాగు సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు త్వరితగతిన స్పందించి సాగునీటి సమస్యలను పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రపంచాన్ని శాసించేది.. చదువు మాత్రమే

*** డాక్టర్ టి. బాలకృష్ణ, డాక్టర్ జ్యోష్న * శ్రీ సాయి శ్రీనివాస మల్టీస్పెషల్టి హాస్పిటల్ 20 వసంతాలు వేడుక * శ్రీ సాయి విద్యా జ్యోతి ప్రతిభ పురస్కారాలు ప్రధానం**



**పలాస, జూన్7 (వార్త):** ప్రపంచాన్ని శాసించేది ఒక్క విద్యారంగమేనని, చదువుని ఎవరు దోచుకోలేరని శ్రీ సాయి శ్రీనివాస మల్టీస్పెషల్ ఆసుపత్రి ఎండి డాక్టర్ టి. బాలకృష్ణ, డాక్టర్ జ్యోష్నలు అన్నారు. ఆదివారం కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పలాస నియోజకవర్గం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 140 మంది విద్యార్థులకు ఉత్తమ శ్రీ సాయి విద్యా జ్యోతి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఉందని తెలిపారు. తాను ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విద్యను అభ్యసించానని, ప్రధానంగా మూడు విషయాలు గుర్తుంచుకోవాలని, పట్టుదల క్రమశిక్షణ నిరంతర శ్రమతో పాటుపడాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లా వాసులు మాట్లాడేందుకు సంకోచిస్తారని ధైర్యంగా మాట్లాడేటప్పుడే వాళ్ల భావాలు గోచరిస్తాయని చెప్పారు. ఉత్తరాంధ్ర కి చెందిన ప్రముఖ వైద్యులు మన జిల్లా చెందిన వాళ్లేనని అన్నారు. మన జిల్లా వాసులు చదువులో ముందుంటారు తప్ప మాట్లాడే విషయంలో వెనక బడుతున్నారని చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యంగా భావించి డాక్టర్ దంపతులకు అభినందనీయమని శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరికట్ల విఠల్ రావు మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు టార్గెట్ ను నిర్దేశించి పాఠశాలలను బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాశిబుగ్గ సబ్ డివిజనల్ అధికారి టి. భవాని, ఉప విద్యాశాఖ అధికారి విలియమ్స్, మండల విద్యాశాఖ అధికారులు సత్యం, బివి. రమణ, భాస్కరరావు, శ్రీ సాయి శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండి టి విశ్వనాథం, నియోజకవర్గంలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించండి

*** ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జి. శ్రీ రాములు**

**పలాస, జూన్ 7 (వార్త):** ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించాలని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జి శ్రీరాములు అన్నారు. ఆదివారం పలాస క్యాజువల్ మ్యానుఫ్యాక్చర్ అసోసియేషన్‌లో ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా హోటల్ యజమానులకు, తినుబండారాల దుకాణం దారులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఆహార భద్రత సంస్థ - అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, శ్రీకాకుళం వారి సౌజన్యంతో సంయుక్తంగా పలాసలో వివిధ షాపులలో, ఆహార విక్రయ కేంద్రాలలో, హోటల్స్ లలో ఇన్స్పెక్షన్లను నిర్వహించారు. పాల, నీటి విక్రయ కేంద్రాలలో, ఆహార విక్రయ కేంద్రాలలో ఎటువంటి కల్తీ జరగరాదని కల్తీ జరిగిన ఎడల సెక్షన్ 31 క్రింద కోర్టులో కంప్లైంట్ లను దాఖలు చేయడం జరుగుతుందని, షాపుల వారికి, అవగాహన కల్పించారు. హోటల్స్ లో కూడా ఆహారం తయారు చేసేటప్పుడు పరిశుభ్రత పరమైన చర్యలు చేపట్టాలని, నిలవ ఉండే ఆహారాన్ని పారవేయాలని, ప్రజల యొక్క ఆరోగ్య భద్రత విషయంలో అత్యంత జాగ్రత్త వహించాలని కూడా తెలియజేయడం జరిగింది. ఆహార భద్రతా చట్టం క్రింద సెక్షన్ 31 సెక్షన్ కింద కూడా కల్తీలు నివారించేలా చూడాలని, మ్యానుఫ్యాక్చరింగ్ డేట్ లేని వస్తువులను, ఆహార పదార్థాలను, పానీయాలను విక్రయించరాదని అటువంటి పానీయాలను పదార్థాలను కూడా చెత్తబుట్టలలో పారేశారు. పలాస కాజు మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఆహార భద్రత అనేది కుటుంబంలో మొదలై ప్రతి ఒక్కరు కూడా తీసుకోవలసిన ప్రథమ జాగ్రత్త అని, ప్రజలందరూ కూడా వారి ఆరోగ్యాన్ని సంపూర్ణంగా పరిరక్షించుకునే విధంగా ఆహారాన్ని తీసుకునేటప్పుడు తగు జాగ్రత్తలు వహించాలని మరియు వ్యాపార రంగంలో వారు, ఆహారాన్ని తయారు చేసే హోటల్స్ వారు కూడా కల్తీ లేని ఆహార పదార్థాలను, ముడి సరుకులను ప్రజలకు అందే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎక్స్పైరీ డేట్ అయిపోయిన వస్తువులను తక్షణమే పారవేయాలని తెలియజేశారు. ప్రజల పూర్తి ఆరోగ్యమే వారి అభివృద్ధికి తద్వారా మానసిక శారీరక వికాసానికి తదుపరి దేశానికి కూడా ఒక మూల స్తంభం అని వక్తలు తెలియజేశారు. ఆహార భద్రత మరియు కల్తీ లేని ఆహారఅమ్ అంశాలు మరియు ఉచిత న్యాయ సేవలకు చెందిన కరపత్రాలను ఈ సందర్భంగా అందరూ ప్రదర్శించారు. ఉచిత న్యాయ సేవలు కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ను సంప్రదించవచ్చని న్యాయవాది లోకేశ్వర్ రావు గారు తెలియజేశారు. ఈనాటి పరిస్థితులలో కాలుష్య నివారణకు పూర్తిగా ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించాలని, ప్లాస్టిక్ కవర్లు డబ్బాలలో ప్యాక్ చేసిన ఆహారాన్ని తీసుకోవడం కూడా అనారోగ్య కారకమని కనుక అటువంటి చర్యలను కూడా నివారించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పానల్ న్యాయవాది డాక్టర్ కే.లోకేశ్వరరావు, క్యాజు మ్యానుఫ్యాక్చర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మల్ల శ్రీనివాసరావు, గౌరవ ప్రెసిడెంట్ బల్ల నారాయణరావు, అదే విధంగా స్థానిక వ్యాపార, హోటల్ యాజమాన్యం, ప్రతినిధులు పాల్గొన్నారు.



## స్నేహితుడిని పరామర్శించిన మంత్రి కొండపల్లి



**మెళియాపుట్టి, జూన్ 7 (వార్త):** స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం అనే పదాలకు నిర్వచనం చాటి చెబుతూ తన హోదా సైతం పక్కకు పెట్టి తన స్నేహ బంధం పట్ల ఉన్న మంచితనాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చాటి చెప్పారు. జీఎంఆర్ ఇన్స్టిట్యూట్‌లో తనతో పాటు ఇంజనీరింగ్ కలసి చదువుకొని, అమెరికాలో రూమ్మేట్స్ గా కొనసాగిన శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం పెద్ద పద్మాపురం గ్రామానికి చెందిన మాలతి శ్రీకాంత్ తండ్రి మాలతి హరికృష్ణ (రిటైర్డ్ ప్రొఫెసర్) ఇటీవల మృతి చెందారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కి ఎంతో బిజీ షెడ్యూల్ ఉన్నా తండ్రి ని కోల్పోయి దుఃఖంలో ఉన్న తన స్నేహితుడు శ్రీకాంత్ ను ఓదార్చడం కోసం తన నియోజకవర్గ నుంచి ఆదివారం 180 కిలోమీటర్ల పైగా ప్రయాణం సాగించి శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం పెద్ద పద్మాపురం గ్రామానికి ఆదివారం నాడు చేరుకుని హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తన స్నేహితుడు శ్రీకాంత్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆత్మీయ పలకరింపు కోసం విచ్చేసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంచి హృదయాన్ని తన స్నేహితులని, గ్రామస్తులు కొనియాడారు.

## సాంప్రదాయ కళలతో మానసిక వికాసం






**మందస, జూన్ 7(వార్త):**సాంప్రదాయ కళలతో మానసిక వికాసం కలుగుతుందని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, మండల విద్యాశాఖాధికారి మర్రిపాటి లక్ష్మణరావు, హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ కె.స్వరాజ్యలక్ష్మి అన్నారు. మందస మండలంలో హరిపురంలో శ్రీసాయి మెహెర్ నృత్య కళాక్షేత్రం నిర్వహిస్తున్న వేసవి శిక్షణా ముగింపు కార్యక్రమంలో ఆదివారం జరిగాయి. కార్యక్రమంలో కృష్ణప్రసాద్, లక్ష్మణరావు, స్వరాజ్యలక్ష్మి, నాయకులు మాట్లాడుతూ నేటి తరం చిన్నారులకు సంప్రదాయనృత్యం అవసరమన్నారు. కళలు పిల్లల మనోవికాసాన్ని పెంపొందించుతాయన్నారు. నాట్యంతో ఆరోగ్యం కూడా లభిస్తుందన్నారు. నృత్యంతో శారీరక అలసట చెందుతుందన్నారు. 64కళలలో ఒకటైన నాట్యం ఎంతో శాస్త్రీయమైనదన్నారు. ఈ ప్రాంతంలో నాట్యకళను అభివృద్ధి చేస్తున్న నారాయణశెట్టి శైలజ అభినందనీయురాలన్నారు. గురువుగా శైలజ చేస్తున్న కృషి వెలకట్టలేదనిదని ప్రశంసలు కురిపించారు. చిన్నారులు, విద్యార్థులకు నాట్యం నేర్పిస్తూ.. స్వయంగా తాను పలు కార్యక్రమాల్లో నాట్య ప్రదర్శనతో అందర్నీ ఆకట్టుకుంటున్నారని కొనియాడారు. అనంతరం శిక్షణ పొందిన, ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, మెడల్స్ అందజేశారు. నాట్యగురువు శైలజ మాట్లాడుతూ కళామతల్లి సేవలో ఎంతో ఆనందం ఉందన్నారు. తనకు పూర్వజన్మ సుకృతమే నాట్యకళ సిద్ధించిందన్నారు. పలువురు కళాకారులను తయారు చేయడం తన జీవితంతో మధురానుభూతిని మిగిలుస్తోందన్నారు. తనకు సహకరిస్తున్న ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బైరిశెట్టి గున్నయ్య, భానూజీ, వూనా జయకృష్ణ, పలువురు నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాలి



**కంచిలి, జూన్ 7 (వార్త):** ఓటర్ల జాబితాలో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో వడపోత కార్యక్రమం త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని మండల టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు కోరారు. ఈ ప్రక్రియ అన్ని రాష్ట్రాల్లోనూ జరుగుతుందని అన్నారు. కొన్ని రాష్ట్రాల్లో కోట్ల సంఖ్యలోనూ కొన్ని రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలోనూ బినామీ ఓట్లును తొలగిస్తున్న నేపథ్యంలో ప్రతి బూతులో ఓట్లను ఇప్పటికే సరిచూసుకొని తప్పులను సవరించుకోవాలని సూచించారు. త్వరలో సచివాలయంలోని బి ఎల్ వో ల ద్వారా ఈ ప్రక్రియ మన ప్రాంతంలోనూ ప్రారంభం కాబోతుందని అన్నారు. ఒరిజినల్ ఓట్లు వడబోతకు గురికాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు. కంచిలి మండలంలోని 31 గ్రామ పంచాయతీల నుంచి బిఎల్ఎలు కార్యకర్తలు హాజరయ్యారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

**పోలాకి, జూన్ 7 (వార్త):**అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం పోలాకి మండలంలోని కిళ్ళాం గ్రామానికి చెందిన రాగోలు సరస్వతికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.41,084 చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ఈ నిధి ఒక సంజీవనిలా పనిచేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి బాధితుడికి ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం చేరేలా తమ వంతు కృషి కొనసాగిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని, సంక్షేమ పథకాల ద్వారా సామాన్యులకు భరోసా కల్పిస్తోందన్నారు. సకాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందేలా సహకరించిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి, రాష్ట్ర ప్రభుత్వానికి రాగోలు సరస్వతి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.బీ. రామన్న, ఉపసర్పంచ్ పొట్నూరు సత్యనారాయణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రెడ్డి సతీష్, దుంగ సింహాచలం, రావాడ నరసింహులు, తండ్యాల శ్రీను, పాగోటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**పలాస, జూన్ 7 (వార్త):** మండలం బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-01 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థిని విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో 25 వసంతాల స్నేహ బంధాల సంబరంను నిర్వహించుకున్నారు. గడచిన 25 సంవత్సరాల స్నేహం చిరస్థాయిగా నిలవాలని కోరుకున్నారు. చదువుకున్న పాఠశాలలో తాము ఉపాధ్యాయుల వద్ద నేర్చుకున్న జీవిత పాఠాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు కలుసుకొని తమ చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఉద్యోగ కుటుంబ జీవన అనుభవాలను తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు పైల మల్లేశ్వరరావు, రామారావు, చిన్నవాడు, వెంకటరమణ, బొడ్డు చిన్నారావు, మామిడి భాస్కరరావు, బత్తిని వైకుంఠ రావు, గణపతిలను ఘనంగా సన్మానించారు. తమతో చదువుకున్న దూరమైన మిత్రులను తలుచుకుని విచారాన్ని వ్యక్తం చేశారు. భవిష్యత్తు సమావేశాలపై చర్చించారు. ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు.



## ఏటీఎస్, వీఎల్టీడీ విధానాలను రద్దు చేయాలి


* సరుకు రవాణా రంగ సమస్యల పరిష్కారించాలి
* శ్రీకాకుళం జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్



**నరసన్నపేట, జూన్ 7 (వార్త):** ఏటీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయడంతో పాటు గూడ్స్ వాహనాలపై అమలు చేస్తున్న వీఎల్టీడీ విధానాన్ని కూడా ఉపసంహరించుకోవాలని శ్రీకాకుళం జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఆదివారం నరసన్నపేటలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, లారీ డ్రైవర్లు పాల్గొని తమ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఇప్పటికే డీజిల్ ధరల పెరుగుదల, టోల్ ఛార్జీలు, వాహన నిర్వహణ వ్యయాలు అధికమవడంతో రవాణా రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అదనపు నియంత్రణలు, ఛార్జీల రూపంలో ప్రభుత్వ విధానాలు లారీ యజమానులు, డ్రైవర్లపై మరింత భారం మోపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటీఎస్ మరియు వీఎల్టీడీ విధానాల కారణంగా సరుకు రవాణాలో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వీటి వల్ల చిన్న స్థాయి లారీ యజమానులు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. రవాణా రంగాన్ని ఆదుకునే విధంగా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని ఈ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సరుకు రవాణా వ్యవస్థ దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమని, ఈ రంగ సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యంగా పరిగణించి పరిష్కార మార్గాలు చూపాలని నాయకులు కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో న్యూ ఆంధ్ర లారీ, ట్రక్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శేషగిరిరావు, జనార్దన్ రావు, రావడ భాస్కరరావు తదితర నాయకులతో పాటు లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్లతో వాహనదారులకు ఇబ్బందులు

* రోడ్లపై ఎగురుతున్న ఇసుకతో ప్రమాదాలు
* చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



**నరసన్నపేట, జూన్ 7(వార్త):** నరసన్నపేట మండలంలో నిత్యం సంచరిస్తున్న ఇసుక ట్రాక్టర్లు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుక రోడ్లపై పడిపోవడంతో పాటు గాలికి ఎగురుతూ ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తోందని చెబుతున్నారు. ఇసుక రవాణా సమయంలో ట్రాక్టర్లకు తప్పనిసరిగా పరదాలు ఏర్పాటు చేయాలన్న నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని చాలా వరకు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పరదాలు లేకుండా ఇసుక తరలించడం వల్ల గాలికి ఎగిరే ధూళి నేరుగా వాహనదారుల కళ్లలో పడుతూ ప్రమాదాలకు దారితీస్తోందని వాపోతున్నారు. ప్రత్యేకించి ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోడ్లపై ఇసుక పేరుకుపోవడంతో వాహనాలు జారిపడే ప్రమాదం కూడా ఉందని పేర్కొంటున్నారు. పాదచారులు, వ్యాపారులు కూడా ధూళి కారణంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు ఇసుక రవాణాపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టి నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ట్రాక్టర్లకు పరదాలు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్లపై పడుతున్న ఇసుకను తొలగించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా ఇసుక రవాణా వ్యవస్థను నియంత్రించకపోతే ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీముఖలింగేశ్వర ఆలయంలో అన్నప్రసాద వితరణ



**జలుమూరు, జూన్ 7 (వార్త):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వర ఆలయంలో అన్నప్రసాద కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో ఏడుకొండలు కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన కుమారుడికి ఉద్యోగం వస్తే స్వామివారికి మొక్కు పెట్టుకుని అన్నదానం నిర్వహిస్తానని సంకల్పించుకున్నట్లు ఏడుకొండలు తెలిపారు. శ్రీముఖలింగేశ్వర స్వామి కటాక్షంతో తమ కుమారుడికి ఉద్యోగం లభించడంతో మొక్కు తీర్చుకుంటూ అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా మొదట ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులు, గ్రామస్థులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సోమవారం కూడా అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని ఈవో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీముఖలింగం గ్రామ మాజీ వైస్ సర్పంచ్ గుంట కర్ణవీరుడు, ఎండోమెంట్ సిబ్బంది, పాత్రికేయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

**సోంపేట, జూన్ 7(వార్త):** జింకిభద్ర గ్రామానికి చెందిన తెలుకల తేజేశ్వరరావు అనే యువకుడు ఆదివారం ఉదయం బూరగాం గ్రామ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతడు సోంపేటలో గల ఒక గ్యాస్ ఏజెన్సీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం వివాహం జరిగినప్పటికీ వివాహం జరిగినప్పటికీ సంతానం లేకపోవడం ఆర్థిక పరిస్థితులు భారంగా మారడం తదితర కారణాల రీత్యా ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. పలాస ఆర్పిఎఫ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోంపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. జింక భద్ర గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

**సారవకోట, జూన్ 7 (వార్త):** సారవకోట ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, వాబ గ్రామానికి చెందిన కోయిలాపు నర్సునాయుడు బైక్‌పై ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో నర్సునాయుడుకు తలకు బలమైన గాయం కావడంతో అక్కడున్న స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం క్షతగాత్రుడిని మెరుగైన వైద్య చికిత్స కోసం నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. వాహనదారులు రహదారులపై అప్రమత్తంగా ప్రయాణించి రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని స్థానికులు సూచిస్తున్నారు.

# యోగాంధ్రతోనే సంపూర్ణ ఆరోగ్యం

* మానసిక ఒత్తిడి, ఆందోళనలకు యోగాతో చెక్ * కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యే గొండు శంకర్ * కార్గిల్ పార్కులో ఘనంగా 'యోగాంధ్ర-2026' ప్రారంభం



**శ్రీకాకుళం, జూన్ 7(వార్త):** ప్రతి ఒక్కరూ శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడంతో పాటు మానసిక ఒత్తిడి, ఆందోళనలను దూరం చేసుకుని ఏకాగ్రతను పెంచుకోవడానికి యోగా ఎంతో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "యోగాంధ్ర-2026" కార్యక్రమాల్లో జిల్లా ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం నగరంలోని కార్గిల్ పార్కులో నూతనంగా నిర్మించిన యోగ ఫ్లాట్‌ఫామ్‌పై యోగాంధ్ర-2026 ప్రారంభ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాలను ప్రారంభించారు. అనంతరం ఆర్ట్ ఆఫ్ లివింగ్, బ్రహ్మకుమారీస్ సంస్థల ఆధ్వర్యంలో కామన్ యోగా ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, అధికారులు, యోగా సాధకులతో కలిసి ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 21న జరగనున్న 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా విస్తృతంగా శిక్షణ శిబిరాలు, పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 21న నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో 1500 మందితో భారీ ఎత్తున మెగా యోగా ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు.



ప్రజలందరూ 'యోగాంధ్ర' యాప్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. కార్గిల్ పార్కులో ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు ఈ యోగా శిబిరాలు కొనసాగుతాయన్నారు. ముఖ్యమంత్రి పిలుపును అందుకోవాలి: ఎమ్మెల్యే ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన కోసం ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలన్నారు. గత ఏడాది నిర్వహించిన యోగా కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని, అదే ఉత్సాహం, స్ఫూర్తితో ఈ ఏడాది కూడా విజయవంతం చేసి ప్రధానమంత్రి యోగా సందేశాన్ని జనబాహుళ్యంలోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ నెల 7వ తేదీ నుంచి



జిల్లావ్యాప్తంగా మండల, సచివాలయాల పరిధిలో యోగా శిక్షణ, పోటీలు ఉంటాయని అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఈ నెల 11న మత్స్యకారుల గ్రామాల్లో, 16న పర్యాటక ప్రాంతమైన డచ్ బంగళా వద్ద, 19న పుణ్యక్షేత్రమైన శ్రీకూర్మంలో ప్రత్యేక యోగా ప్రదర్శనలు నిర్వహించనున్నారు. అలాగే జూన్ 7 నుంచి 9 వరకు గ్రామ స్థాయిలో, 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో, 14 నుంచి 16 వరకు జిల్లా స్థాయిలో, 18 నుంచి 20 వరకు రాష్ట్ర స్థాయిలో సోలో యోగా, ప్రాణాయామం, సింక్రనైజ్డ్ గ్రూప్ యోగా, క్విజ్, వ్యాసరచన పోటీలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో డిపిఓ స్వరూప రాణి, డిఆర్ఓ విశ్వేశ్వరరావు, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఉత్తమ్ రాజ్ రాణా, జెడ్పీ సీఈఓ వెంకట్రామన్, యోగా శిక్షకులు పాండ్రంకి మురళీకృష్ణ, కొంక్యాన మురళీధర్, సందీప్, కల్పన, తంగి స్వాతి, అలాగే షిర్డీ సాయి యోగ సెంటర్, సూర్య ప్రణవ పతంజలి, బ్రహ్మకుమారీస్ సంస్థల ప్రతినిధులు, యోగా సాధకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.






## ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

* హెల్మెట్‌తో మీ ప్రాణానికి రక్షణ
* కాశీబుగ్గ డీఎస్పీ భవాని

**పలాస, జూన్ 7 వార్త):** హెల్మెట్ తోనే మీ ప్రాణానికి రక్షణ వస్తుందని కాశీబుగ్గ డి.ఎస్.పి టి భవాని అన్నారు. కాశీబుగ్గ పట్టణంలో పోలీసులు నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టి వాహనదారుల్లో రోడ్డు ప్రమాదాలపై భద్రతపై అవగాహన కల్పించారు. డీఎస్పీ టీ భవాని స్వయంగా తనిఖీలు నిర్వహించి ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు."రోడ్డు ప్రమాదాల వల్ల నష్టం జరిగేది ఒక వ్యక్తికి మాత్రమే కాదు, ఒక కుటుంబానికి.. దయచేసి ఎవరూ అతివేగంతో లేదా నిర్లక్ష్యంగా వాహనాలు నడపవద్దు"అని, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, అతివేగం తగ్గించడం వల్ల రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చునని తెలిపారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల ప్రమాదాల సమయంలో తీవ్ర గాయాలు, ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అతివేగం,నిర్లక్ష్యంగా వాహనం నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూడ్రైవింగ్ చేయడం వంటి చర్యలు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆమె అన్నారు. తనిఖీల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.ప్రజల ప్రాణాల రక్షణే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని,ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ ఎస్ఐ ఆర్.నరసింహమూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## 9న పొందూరులో సూక్ష్మ పరిశ్రమల పార్కుకు శంకుస్థాపన

**పొందూరు, జూన్ 7 (వార్త):** పొందూరు మండలం వీఆర్ గూడెం గ్రామంలో నిర్మించనున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పార్కుకు ఈ నెల 9న ఉదయం 9.30 గంటలకు శంకుస్థాపన జరగనుంది. వీఆర్ గూడెంలోని సర్వే నెంబర్ 132 పరిధిలోని 30 ఎకరాల విస్తీర్ణంలో ఈ పార్కును ఏర్పాటు చేయనున్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంతో పాటు అనంతరం రాపాక గ్రామంలో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లు, వెల్‌నెస్ సెంటర్, గ్రామ సచివాలయ భవనం, తాగునీటి సరఫరా పథకాలను అధికారికంగా ప్రారంభించనున్నారు. అనంతరం రాపాకలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆమదాలవలస శాసనసభ్యులు, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర సెర్ప్, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. ఈ మేరకు శాసనసభ్యుల కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. నియోజకవర్గ పరిధిలోని కూటమి నాయకులు, క్లస్టర్, కో-క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, యూనిట్, కో-యూనిట్ ఇన్‌ఛార్జీలు, కన్వీనర్లు, కుటుంబ సాధికార సారథులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell: 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546